క్లుప్తంగా

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు తనిఖీ



మోడల్ కళాశాలలో తనిఖీ చేస్తున్న డీఐఈవో

కోటపల్లి: ఇంటర్ ప్రాక్టికల్స్ గురువారం ప్రారంభం కాగా కోటపల్లి మండలకేంద్రంలోని మోడల్ కళాశాలలో జరుగుతున్న ప్రాక్టికల్స్‌ను డీఐఈవో అంజయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మొదటి రోజు బాటనీ ప్రాక్టికల్ నిర్వహణ తీరుపై ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రాక్టికల్స్‌లో ఎలాంటి మాస్‌కాపీయింగ్‌కు పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ రాజశేఖర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజానికి కృషిచేద్దాం

మంచిర్యాలటౌన్: యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి సమష్టిగా కృషి చేద్దామని సీఐ ప్రమోద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జిల్లా మహిళ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన నషా ముక్త్ భారత్ అభియాన్, మిషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన యాంటి డ్రగ్స్ అవగాహన కార్యక్రమానికి ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ మనీషా రాథోడ్, కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సులేమాన్‌లతో కలిసి హాజరై మాట్లాడారు. బాలబాలికలు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగంగా ప్రతిజ్ఞ చేయించి, యాంటీ డ్రగ్స్ సంబంధిత వివరణాత్మక వీడియోలను స్క్రీన్‌పై ప్రదర్శించి అవగాహన కల్పించారు.

రాజకీయ పార్టీలతో సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో, నాయకులు

కాసిపేట: 2వ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు 2025 ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ స్టేషన్‌ల జాబితా అభ్యంతరాలపై గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకుల సలహాలు, సూచనలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీవో షేక్ సబ్బర్ అలీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేముల కృష్ణ, మైదం రమేష్, గోలేటి స్వామి, బీఆర్ఎస్ నాయకులు వాసుదేవ్, బీజేపీ నాయకులు బాలరాజు, టీడీపీ భీమయ్య, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మినారాయణ తదితరులున్నారు.

డిజిటల్ పంటల నమోదు పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

కాసిపేట: మండలంలోని మల్కేపల్లి, వరిపేట గ్రామాల్లో చేస్తున్న డిజిటల్ పంటల నమోదు కార్యక్రమాన్ని గురువారం మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రభాకర్ పరిశీలించారు. ఏఈవోలు ప్రతి సర్వేనంబర్‌లో ప్రతి కమతం వద్దకు వెళ్లి డిజిటల్ పద్ధతిలో పంటల నమోదు చేయాలన్నారు. దీంతో పంటల వివరాలలో ఖచ్చితత్వం ఉంటుందన్నారు. దీని ద్వారా రైతుల పంటలకు మద్దతు ధర లభిస్తుందన్నారు. వరి పంట ప్రస్తుతం పిలక దశలో ఉందని, అక్కడక్కడ ఖాండం తొలిచే పురుగు ఆశించిందన్నారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో సంధ్య, రైతులు పాల్గొన్నారు.

భీమిని: డిజిటల్ క్రాప్ నమోదు పక్కాగా చేపట్టాలని ఏడీఏ సురేఖ అన్నారు. వడాల గ్రామ పరిధిలోని పంటలను గురువారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

ఆయిల్ పామ్ సాగు పరిశీలన

లక్సెట్టిపేట: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో సాగు చేసిన ఆయిల్ పామ్ తోటను మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ గురువారం సందర్శించారు. వినూత్న పద్ధతుల్లో ఆయిల్ పామ్ సాగు చేయడం ఎంతో లాభదాయకంగా ఉంటుందని వివరించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు తోట యజమాని కారుకూరి రమేశ్‌కు సూచించారు. ర్యక్రమంలో విస్తరణాధికారి ఇర్ఫానాయాస్మిన్, సిబ్బంది పాల్గొన్నారు.

నడిగూడంలో తాగునీటి తండ్లాట



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఆరేవాడ నడిగూడంలో తాగునీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 30కుటుంబాలు నెల రోజులుగా తాగునీరు లేక నానా తంటాలు పడుతున్నారు. ఈ కాలనీలో చేతి పంపు ఉన్నా సరిగ్గా పని చేయడం లేదు. ఈ విషయమై పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి, ఎంపీడీవోకు తెలిపినా పట్టించుకోవడం లేదు. మిషన్ భగీరథ నీరు ఈ కాలనీకి అందని ద్రాక్షగా మారింది. బోరువెల్ వేయించి, పైపులైన్ ఏర్పాటు చేసినా మోటార్లు పనిచేయక తాగునీరు అందడం లేదు. అధికారులు గ్రామపంచాయతీ ఖాతాల్లో నిధులు లేవని రిపేర్ చేయలేక ముఖం చాటేస్తున్నారు. అధికారులు స్పందించి తాగునీరు అందించాలని వేడుకుంటున్నారు.

కనుల పండువగా రథోత్సవం

జన్నారం: మండలంలోని కలమడుగు గ్రామ శ్రీ నరనారాయణ స్వామి ఆలయ 40వ వార్షికోత్సవం పురస్కరించుకొని గురువారం నరనారాయణ స్వామి రథోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్‌కుమార్, పూజారులు కారక నర్సయ్య, రాజన రేంద్ర శర్మ ఆధ్వర్యంలో స్వామివార్లను రథం పై ఉంచి ఊరేగించారు. వివేకానంద పాఠశాల చిన్నారులు కోలాటాలతో ఆకట్టుకోగా, గ్రామ యువకులు నృత్యం చేస్తూ రథాన్ని ముందుకు కదిలించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విష్ణు, బొంతల మల్లేశ్, అంజగౌడ్, భూమన్న, రంగన్న, కిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మరమ్మతులు.. తప్పని తిప్పలు



పైపులైన్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో తాగునీటి కష్టాలు మళ్లీ పునరావృతమయ్యాయి. కొన్ని రోజుల క్రితం మొదలైన నీటి ఇక్కట్లు సద్దుమణిగిన తర్వాత మళ్లీ ఉత్పన్నంకావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూసివేతకు గురైన మాదారం వన్ ఇంక్‌లైన్(ఎంవీకే-1) నుంచి మాదారం ఫిల్టర్ బెడ్ వరకు తాగునీటిని ఎత్తిపోసే పంపు మోటారు చెడిపోవడంతో సమస్య ఏర్పడింది. ప్రస్తుతం నీటి సరఫరా ఆగిపోవడంతో నానా యాతన పడుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. నెలకోసారి పంపు మోటారు మరమ్మతులకు వస్తుండటంతో నీటి కష్టాలు రిపీట్ అవుతున్నాయి. దీంతో కార్మికులు నీళ్లకోసం పడరాని పాట్లు పడుతున్నారు.



గాంధారి ఖిల్లా ముఖద్వారం

జాతరకు వేళాయె..!

- నేటి నుంచి మూడు రోజుల పాటు గాంధారి మైసమ్మ జాతర
- ఏర్పాట్లు పూర్తి

రామకృష్ణాపూర్: ఆదివాసీ గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే గాంధారి మైసమ్మ జాతర ఉత్సవాలకు మందమర్రి మండలం బొక్కలగుట్టలోని గాంధారి ఖిల్లా ప్రాంగణం ముస్తాబైంది. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు సాగే ఈ ఉత్సవాలకు ప్రభుత్వ అధికారులు, ఆదివాసీ నాయక్‌పోడ్ కమిటీ నాయకులు ఏర్పాట్లు చేశారు. వర్షాలు కురువాలని పంటలు బాగా పండాలని ఆదివాసీ నాయక్‌పోడ్‌లు గాంధారి ఖిల్లా వద్ద పూజలు చేయటం ఆనవాయితీగా వస్తోంది. మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఈ ఉత్సవాలు యేటా జరపడం ఆదివాసీల సంప్రదాయంగా కొనసాగుతోంది.

ముమ్మర ఏర్పాట్లు..

గాంధారి మైసమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని ఖిల్లా వద్ద విస్తృతంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం మంచినీటి వసతి, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల కోసం ఒక వేదిక ఏర్పాటు చేశారు. విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఖిల్లాకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మున్సిపల్, రెవెన్యూ యంత్రాంగంతో పాటు పోలీస్, వైద్య శాఖలు కూడా తమ సేవలు అందించనున్నాయి.

మూడు రోజుల జాతర...

ఆదివాసీలు దేవతామూర్తులను అత్యంత వైభవంగా ప్రతిష్ఠించనున్నారు. తొలిరోజైన శుక్రవారం బొక్కలగుట్టలోని సదర్‌భీమన్న నుంచి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తప్పెట గూళ్లు, పిల్లనగ్రోవి ఆటపాటలతో డప్పుచప్పుళ్లతో కాలినడకన ఊరేగింపుగా ఆదివాసీలు గోదావరి నదికి వెళ్తారు. ఏటా మధ్యాహ్నం ఈ ఊరేగింపు ప్రారంభిస్తుండగా ఎండల దృష్ట్యా ఈ సారి ఉదయం 8గంటలకే ప్రారంభించనున్నారు. గోదావరిలో దేవతామూర్తులను నదీ జలాలతో శుద్ధి చేసిన అనంతరం, తిరిగి సదర్‌భీమన్న వద్దకు వచ్చి రాత్రికి బస చేస్తారు. 15న మరోసారి నదీ జలాలతో అభిషేకం చేస్తారు. సాయంత్రం సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి ఆదివాసీలు ఖిల్లా దిగువ భాగానికి చేరుకొని పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం అర్ధరాత్రి ధాటాక తల్లికి పెద్దపూజ చేపడతారు. అనంతరం జాతరలో చివరి రోజైన ఆదివారం ఆదివాసీ గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ప్రజా దర్బార్ ఏర్పాటు చేస్తారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు పాల్గొంటారు.



కొలువుదీరిన మైసమ్మ తల్లి

ఘన చరిత గాంధారి ఖిల్లాది..

మంచిర్యాల జిల్లా బొక్కలగుట్ట గ్రామం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో గాంధారి ఖిల్లా ఉంటుంది. ఖిల్లా ముందు పెద్ద ద్వారం స్వాగతం పలుకుతుంది. పైకి వెళుతోంటే కాలభైరవ విగ్రహం దర్శనమిస్తుంది. ఇంకా ఖిల్లా పైకి వెళ్తుంటే పెద్ద దర్వాజ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఇక్కడే మైసమ్మ తల్లి కొలువుతీరి ఉంటుంది. అనంతరం ఏడు తలల నాగదేవత విగ్రహం, ఖిల్లా ప్రాంగణంలో రెడ్డిరాజుల శిలా శాసనం ఉంటుంది. వీరాంజనేయ స్వామి విగ్రహం, గుర్రాల కొలను, ఏనుగుల బావి ఖిల్లాలోని మరికొన్ని ప్రత్యేకతలుగా చెప్పవచ్చు. ప్రతిష్ఠాత్మకమైన ఉత్సవాలు కావడంతో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి అత్యధిక సంఖ్యలో ఆదివాసీలు తరలివస్తారు. అంతేగాక మహా రాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఖమ్మం, వరంగల్ తదితర జిల్లాలకు చెందిన నాయక్‌పోడ్ ఆదివాసీలు గాంధారి మైసమ్మ ఉత్సవాల్లో పాల్గొనడం ఇక్కడి ప్రత్యేకత. దాదాపు 400సంవత్సరాల క్రితం కాకతీయ సామంతులు ఈ ప్రాంతాన్ని పరిపాలించినట్లు చరిత్ర పాఠాలు చెబుతున్నాయి.



కొలువు దీరిన దేవతామూర్తులు

మిట్టపల్లిలో డీపీవో పర్యటన

లక్సెట్టిపేట: మండలంలోని మిట్టపల్లి గ్రామంలో గురువారం జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు పర్యటించారు. గ్రామంలో మార్చి నెలలోపు ఇంటిపన్నులు వందశాతం వసూలు చేయాలని, ఎలాంటి బకాయిలు ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వసూలు చేసిన డబ్బులను వెంటనే చలానా ద్వారా గ్రామ పంచాయతీ నిధికి జమ చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు పూడిక తీయించాలన్నారు. డంపింగ్ యార్డులో ప్లాస్టిక్ కవర్లు, ఇతర చెత్తను వేరు చేయాలన్నారు. వారానికి రెండు రోజులు డ్రైవేస్ట్ సేకరించి కంపోస్టును తయారు చేయాలని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులు పరిశీలించారు. కార్యదర్శి రాజమణి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



డంపింగ్ యార్డు పరిశీలిస్తున్న డీపీవో

సమ్మక్క జాతరలో భక్తుల సందడి

చెన్నూర్: చెన్నూర్ బతుకమ్మవాగు వంతెన వద్ద సమ్మక్క-సారలమ్మ జాతరలో భక్తులు సందడి చేశారు. చెన్నూర్ మండలంలోని అక్కెపల్లి గ్రామానికి చెందిన గిరిజన కులస్తులు అక్కెపల్లి గుట్ట నుంచి సమ్మక్క-సారలమ్మను భజా భజాత్రీల మధ్య అంత్యంత భక్తి శ్రద్ధలతో గద్దెల పైకి తీసుకొచ్చారు. అనంతరం భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుబ్బరాంపల్లి, కిష్టంపేట గ్రామాల సమీపంలో గురువారం సమ్మక్క-సారలమ్మ జాతర నిర్వహించారు. సారలమ్మ గద్దెను చేరగా భక్తులు దర్శించుకొని పూజలు జరిపారు. కోళ్లు, మేకలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం జాతర ముగియనుంది.



సుబ్బరాంపల్లిలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

తహసీల్దార్ కార్యాలయం ఖాళీ చేయాలని నోటీసులు

భీమారం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని వెంటనే ఖాళీ చేయాలని కోరుతూ అటవీశాఖ అధికారులు తహసీల్దార్ సదానందంకు నోటీసులు అందజేశారు. 2016లో కొత్తగా ఏర్పడ్డ భీమారం మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి చెందిన భవనాలు అందుబాటులో లేకపోవడంతో, అప్పుడే కొత్తగా నిర్మించిన అటవీశాఖ భవనాల్లో పోలీస్‌స్టేషన్‌తో పాటు మరో భవనంలో ఎస్సై నివాసం కోసం కేటాయించారు. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయాన్ని సహకార సంఘం భవనంలో ఏర్పాటు చేశారు. మూడేళ్ల క్రితం పోలీస్‌స్టేషన్‌కు సొంత భవనం నిర్మించడంతో దానిని అందులోకి మార్చారు. కానీ ఎస్సై నివాసానికి మాత్రం ఒక భవనాన్ని ఉపయోగించుకుంటున్నారు. అప్పటివరకు సహకార భవనంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని పోలీస్‌స్టేషన్ ఉన్న భవనంలోకి తరలించారు. అయితే అటవీశాఖ అధికారులు మా శాఖకి చెందిన భవనాలు వెంటనే ఖాళీ చేయాలని తహసీల్దార్‌తో పాటు పోలీస్‌శాఖ అధికారులకు నోటీసులు అందజేశారు. ఈ మేరకు తహసీల్దార్ సదానందం మాట్లాడుతూ.. తహసీల్దార్ కార్యాలయం నిర్వహణకు అనువైన భవనాలు లేవని, ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం జరుగుతుందన్నారు. అది పూర్తయిన వెంటనే కార్యాలయాన్ని అందులోకి మార్చనున్నట్లు పేర్కొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం గోడకు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ క్వార్టర్ అని అతికించిన పోస్టర్

ఎత్తిపోతల పథకం వినియోగంలోకి తేవాలి

కోటపల్లి: మండలంలోని బోరంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం వినియోగంలోకి తీసుకురావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. బోరంపల్లి ఎత్తిపోతల పథకం మోటార్లు, మిషన్, విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లను గురువారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం రూ.6కోట్ల 14లక్షలతో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం దొంగల పాలవుతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బోరంపల్లి ఎత్తిపోతల పథకాన్ని వినియోగం లోకి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఆర్‌సీపీ నాయకులు జయరావు, నగేశ్, చంద్రన్న, ఎర్మ పున్నం పాల్గొన్నారు.

మామిడికి మంచుపురుగు

భీమారం: మండలంలోని కాజిపల్లి గ్రామంలో మామిడి తోటలను గురువారం ఏవో అత్తె సుధాకర్ పరిశీలించారు. మామిడి చెట్లకు మంచుపురుగు ఆశించడంతో ఆకుమచ్చ తెగులు గుర్తించారు. తెగులు నివారణ కోసం రైతులు చర్యలు తీసుకోవాలని, లేకపోతే అనుకున్న స్థాయిలో పంట చేతికి రాదన్నారు. నివారణ కోసం లాండసైహలోత్రిన్ 300మిల్లీలీటరు, కార్బన్డిజం 400గ్రాములు ఎకరానికి పిచికారీ చేయడం ద్వారా తెగులు నివారించవచ్చునని ఏవో తెలిపారు. ఇందులో ఏఈవో అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



కాజిపల్లిలో మామిడి రైతుకు సూచనలు చేస్తున్న ఏవో సుధాకర్

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ

మంచిర్యాలటౌన్/బెల్లంపల్లి: బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ గురువారం జిల్లా కేంద్రంలో బాధ్యతలు చేపట్టారు. జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఐబీ చౌరస్తాలో బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం నిర్వహించగా, అధ్యక్షుడి హోదాలో హాజరయ్యారు. బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్‌గౌడ్‌ను బెల్లంపల్లికి చెందిన మాజీ ఎమ్మెల్యే, పార్టీ నాయకురాలు అమురాజుల శ్రీదేవి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి సన్మానం చేశారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వెంకటేశ్వర్‌గౌడ్

బీజేపీలో చేరిక

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి, నాగారాం గ్రామాలకు చెందిన పలు పార్టీలకు చెందిన నాయకులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం బీజేపీలో చేరారు. నీల్వాయికి చెందిన మాజీ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొప్పుల మధునయ్య, చరణ్‌రాజ్, నాగారాం గ్రామానికి చెందిన ముల్కల్ల సత్యనారాయణ, ఓదెలు, చెన్నల మల్లేష్ బీజేపీలో చేరగా వారికి వెంకటేశ్వర్‌గౌడ్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

జగన్నాథాలయంలో ప్రత్యేక పూజలు

చెన్నూర్: చెన్నూర్ పట్టణానికి చెందిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ గురువారం స్థానిక జగన్నాథాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా ఆలయంలో పూజలు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు తిరుపతి, బీజేపీ నాయకులు రాపర్తి వెంకటేశ్వర్, బత్తుల సమ్మయ్య, శివకృష్ణ, తుమ్మ శ్రీపాల్, కమ్మల శ్రీనివాస్, వంశీకృష్ణ, కాయిత రాజేశ్ పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

మంచిర్యాలటౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా, భారతీయ జనతా పార్టీకి సంబంధించిన జెండాలను మంచిర్యాల పట్టణంలో ఎలాంటి అనుమతులను తీసుకోకుండా ఏర్పాటు చేసి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. బీజేపీ తరుపున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సి.అంజిరెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి హాజరయ్యారు. ఆయనతో పాటు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌లు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. దీంతో జిల్లా బీజేపీ నాయకులు బీజేపీ జెండాలను బుధవారం రాత్రి ఏర్పాటు చేయగా, గురువారం ఉదయం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తొలగించారు. అధికారులు తొలగిస్తున్నా, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ, తిరిగి పార్టీ జెండాలను ఏర్పాటు చేశారు. ఈ విషయమై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శివాజీని వివరణ కోరగా ఎలాంటి అనుమతులను తీసుకోకుండా పార్టీ జెండాలను ఏర్పాటు చేశారని, వాటిని తమ సిబ్బంది తొలగించినా, తిరిగి ఏర్పాటు చేశారన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా, అనుమతులను తీసుకోకుండా పార్టీకి సంబంధించిన జెండాలను ఏర్పాటు చేయొద్దని, కోడ్‌ను అతిక్రమిస్తే చర్యలుంటాయని తెలిపారు.



డివైడర్ల మధ్యలో ఏర్పాటు చేసిన జెండాలు

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసపోటీలు

మంచిర్యాలఅర్బన్: పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం సరోజినీనాయుడు జయంతి సందర్భంగా ఇంగ్లీష్ భాషా దినోత్సవం వేడుకలు జరుపుకున్నారు. సరోజినీనాయుడు ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పి ంచారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఆదర్శ పాఠశాలలో సంచార పుస్తక ప్రదర్శన

మంచిర్యాలఅర్బన్: ఆదర్శ పాఠశాల ఆవరణలో నేషనల్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం సంచార వాహన పుస్తక ప్రదర్శన నిర్వహించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ ఉర్దూ భాషల్లో పలు ఆసక్తికరమైన పుస్తకాలను విద్యార్థులు ఆసక్తితో తిలకించారు.

డాక్ అదాలత్

పాతమంచిర్యాల: పోస్టల్ సేవలకు సంబంధించి ప్రజల ఫిర్యాదులు వినడానికి 49వ డాక్ అదాలత్‌ను మార్చి 25న హైదరాబాద్‌లోని పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు గూగుల్ మీట్ ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌లో ఫిర్యాదులను మార్చి 7వరకు స్వీకరిస్తారన్నారు.

జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక

దండేపల్లి: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు దండేపల్లి మండలంలోని మామిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు (అభిజ్ఞ, గాయిత్రి, సాత్విక్, అజయ్) ఎంపికైనట్లు హెచ్‌ఎం రవీందర్ తెలిపారు.

ఉపాధి కూలీలకు పని కల్పించాలి

తాండూర్: కూలీలందరికీ పని కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ కిషన్ సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం 15వ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పనులు కల్పించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తాండూర్ మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.70 కోట్లతో నిర్వహించిన పనులపై అధికారులు ఆడిట్ చేశారని నివేదిక చదివి వినిపించా రు. పలు గ్రామపంచాయతీల్లో జరిగిన పనుల్లో అవకతవకలకు గాను రూ.6వేలు జరిమానా విధించగా, మరో రూ.7,084దుర్వినియోగం జరిగినట్లు తేల్చారు. సిబ్బంది నుంచి రికవరీకి ఆదేశించినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో అధికారులు కిరణ్, అంబుడ్స్ మెన్ శివరాం, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో నందకుమార్, ఈజీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.